క్లుప్తంగా

విద్యార్థినికి ఎంపీ మోపిదేవి అభినందన




రేపల్లె: కారుమూరు గ్రామానికి చెందిన భాష్యం స్కూలు విద్యార్థిని ఐ.హర్షిత ఇటీవల ప్రకటించిన ఐఐటీ–జేఈఈ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 29వ ర్యాంక్ సాధించింది. పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన విద్యార్థి అభినందన సభలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పాల్గొని, విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, హృదయరాజ్, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, హెచ్ఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

డాక్టర్స్ డే వేడుకలు రేపు

రేపల్లె: ఇండియన్ మెడికల్ అసోసియేషన్–మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 1న పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జ్ జి.హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో ఎంసీఏ, ఐఎంఏ సభ్యులు, వైద్యులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఎరుకుల జాతి ఆరాధ్య దైవం ఏకలవ్య



బాపట్ల: ఎరుకుల జాతి ఆరాధ్య దైవం ఏకలవ్యను ఆయన జన్మదినోత్సవం రోజు స్మరించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ పాలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏకలవ్య జన్మదినోత్సవం సందర్భంగా స్టువర్టుపురం గ్రామంలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రమశిక్షణ, పట్టుదలకు ఏకలవ్య మారుపేరుగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు బోగిరి శ్రీకాంత్ మిత్ర, ట్రెజరర్ జాలగిరి లీలా శంకర్, మేడ గోపి, కుంభ చంద్ర, పాకాల రాజేష్‌బాబీ, కిరణ్ తదితరులున్నారు.

కొల్లూరు ఎస్ఐగా రాజ్యలక్ష్మి



కొల్లూరు : కొల్లూరు ఎస్ఐగా జి.రాజ్యలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

యువతికి వేధింపులు.. యువకుడిపై కేసు

పెదనందిపాడు: యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి, వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పెదనందిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్ర గురువారం తెలిపారు. పెదనందిపాడుకు చెందిన యువతిని అదే గ్రామానికి ప్రవీణ్ అనే యువకుడు ఆమెకు దగ్గరగా ఉంటూనే ఇబ్బందులకు గురిచేశాడు. ఇది గమనించిన యువతి యువకుడిని దూరం పెడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను చూపించి, యువతిని బ్లాక్ మెయిల్ చేయడంతో.. భయపడిన యువతి దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. దీంతో యువతికి ధైర్యం చెప్పిన దిశ టీం సభ్యులు, స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. యువతి ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు. మహిళలను వేధింపులకు గురిచేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ వివరాల మేరకు.. పెదపలకలూరు గ్రామానికి చెందిన షేక్ సుభాని ద్విచక్రవాహనంపై తురకపాలెం వెళుతున్నాడు. శ్యామల నగర్‌కు చెందిన చింతల శ్యామ్ ద్విచక్ర వాహనంలో పలకలూరుకు వెళుతున్నాడు. తురకపాలెం వద్ద ఇరువురి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఇరువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: మండలంలోని నందివెలుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1550 స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బైక్‌లు, ఆటో సీజ్ చేశారు. నిందితుల్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

త్యాగనిరతికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే స్నానమాచరించి, ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీదు విశిష్టతను వారికి వివరించారు. త్యాగనిరతి, ప్రేమ, దయ కలిగి ఉండాలని బోధించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు ఖుర్బానీ ఇచ్చారు. పెద్దలను స్మరించుకుని, మహ్మద్ ప్రవక్త సూక్తులను,ప్రవచనాలను మననం చేసుకున్నారు.



రేపల్లె ఈద్గాలో ప్రత్యేక నమాజులో ఎంపీ మోపిదేవి



ఇస్లాంపేట ఈద్గాలో నమాజ్



భట్టిప్రోలులో ప్రత్యేక ప్రార్థన



జంపని ఈద్గా వద్ద ప్రార్థన



కనగాలలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

చందోలు(పిట్టలవానిపాలెం): బక్రీద్ సందర్భంగా చందోలు ఈద్గా వద్ద చందోలు గ్రామంలోని 8 మసీదులకు సంబంధించిన ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఫిత్రాలను సమర్పించారు. ఎంపీపీ షేక్ బాజీ, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, మునీర్ తదితరులు ప్రార్థనలు చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

■ రేపల్లె: బక్రీదు సందర్భంగా పట్టణంలోని ముస్లింలు ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాలో ప్రత్యేక నమాజ్ చేశారు. ఇమామ్‌లు బక్రీద్ విశిష్టతను వివరించారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఈద్గా కమిటీ సభ్యులు ప్రార్థనలో పాల్గొన్నారు. పేదలకు దానాలు చేశారు.

■ కొల్లూరు : కొల్లూరులోని మసీదులో అనంతవరం, బొద్దులూరుపాడు, ఈపూరు ముస్లింలు బక్రీదు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు: మండలంలోని వేమవరం, పల్లెకోన, వెల్లటూరు, అద్దేపల్లి, భట్టిప్రోలులోని ఈద్గాలు, మసీదులలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ కొల్లూరు : కొల్లూరులోని మసీదులో అనంతవరం, బొద్దులూరుపాడు, ఈపూరు ముస్లింలు బక్రీదు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

■ కర్లపాలెం: పాత ఇస్లాంపేట, కొత్త ఇస్లాం పేట, నాగరాజుపాలెం, నల్లమోతువారిపాలెం, పేరలి, గణపవరం గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు బక్రీద్ నమాజ్ చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దానాలు చేశారు.

■ చెరుకుపల్లి: మండల పరిధిలోని చెరుకుపల్లి, గుళ్లపల్లి, కనగాల గూడవల్లి, మెట్టగొడవారిపాలెం గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు.

■ జంపని(వేమూరు): జంపని గ్రామంలోని ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. షేక్ బుజ్జి, షేక్ బాజీ, రఫీ నమాజ్ చేశారు.

■ నిజాంపట్నం: నిజాంపట్నం, బావాజీపాలెం,కూచినపూడి, అడవుల దీవి, పల్లపట్ల గ్రామాల ముస్లిం సోదరులు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

తొలి ఏకాదశి పండుగను భక్తి ప్రపత్తులతో భక్తులు జరుపుకున్నారు. దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. స్వామి వార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీమహా విష్ణువు శేషతల్పంపై యోగ నిద్రకు వెళ్లే రోజు కనుక తొలి ఏకాదశిగా భక్తులు పండుగ జరుపుకుంటారు. ఈ రోజు వ్రతమాచరించిన వారికి కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం.



పూజలో ఎంపీ మోపిదేవి, అరుణ భాస్కరి దంపతులు



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మ



వెల్లటూరు ఆలయంలో నిర్వహించిన నామ సంకీర్తనలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో అనంతభోగేశ్వర స్వామి



సాధన మండలిలో శ్రీ కృష్ణ భగవానుడు



భట్టిప్రోలు సాధన మండలి ఆధ్వర్యంలో కర్పూర యజ్ఞం



ప్రత్యేక అలంకరణలో రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి

రేపల్లె రూరల్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పూడి రోడ్డులోని లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి, ఓల్డ్ టౌన్‌లోని వేణుగోపాలస్వామి, రైలుపేటలోని పట్టాభిరామస్వామి, రామకోటిపేటలోని కోదండరామస్వామి, గ్రామ దేవత బూరుగులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, పట్టువస్త్రాల అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, అరుణ భాస్కరి దంపతులు కుటుంబ సమేతంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

■ పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, అభిషేకాలు జరిపించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. బండ్లమ్మ ఆలయంలో మహిళలు బండ్లమ్మ ఏకనామం కార్యక్రమాన్ని చేశారు.

■ వేమవరం(భట్టిప్రోలు): సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ధారా నారాయణమూర్తి అభిషేకాలు నిర్వహించారు.

■ భట్టిప్రోలు: తొలి ఏకాదశి శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైనదని తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉపన్యాసకులు సింహ గౌరదాస్ (ఇస్కాన్) పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గురువారం నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గౌరదాస్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్రతాన్ని చాతుర్మాస్యం నియమ నిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధలనుంచి విముక్తి పొందగలరని అన్నారు. మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని పురాణాలలో పేర్కొనబడిందని వివరించారు. అనంతరం జగత్ గురువుకు పురుష సూక్తంతో పాదుకాభిషేకం చేశారు. నవంబర్ 23వ తేదీ వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి తెలిపారు. కార్యక్రమాలను గౌరవాధ్యక్షులు ఎం. తాండవ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి కె. యశోదాదేవి, సహాయక కార్యదర్శి మానేపల్లి వెంకట హృదయ ధనలక్ష్మి, కోశాధికారి పి. దేవసేన ఆండాళ్, కార్యక్రమంలో బండి వెంకట్రావు, తూనుగుంట్ల వెంకటేశ్వర గుప్తా, కొత్తమాసు సాంబశివరరావు, బండి వెంకట్రావు, సీహెచ్‌పాపారావు, జె.శంకరరావు పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు: శ్రీ మహా విష్ణువు శేషతల్పంపై శయనించే రోజు తొలి ఏకాదశిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెల్లటూరులోని ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మను ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. గీతా జ్ఞాన మందిరంలో గురూజీ పందిరి శ్రీశైలం ఆధ్వర్యంలో నామ సంకీర్తనలు ప్రారంభమయ్యాయి. జ్ఞాన మందిర అధ్యక్షులు పమిడిముక్కల శకుంతల, వ్యవస్థాపక కార్యదర్శి వేములవల్లి వనజాక్షి పర్యవేక్షించారు. మహిళలు కోలాటం ఆకట్టుకుంది. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐలవరంలోని కోదండ రామాలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు, భజనలు జరిగాయి.

■ కొల్లూరు : తొలి ఏకాదశి పురస్కరించుకుని అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ గావించిన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు కొమ్మూరు వెంకటశివప్రసాద్, అనంతేశ్వర భరద్వాజ, ఈఓ ఎం. అనుపమ పర్యవేక్షించారు.

కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలి

భట్టిప్రోలు: వెల్లటూరులోని హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ మూసివేస్తున్న నేపథ్యంలో కార్మికులకు లేబర్ యాక్ట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు టి. కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు ఫ్యాక్టరీని సందర్శించి, ప్లాంట్ మేనేజర్ బాషాతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్లాంట్‌లోని ప్యాకింగ్ సిస్టంను మాత్రమే వేరే ప్రాంతానికి తరలిస్తునందున ఆ సెక్షన్‌లోని కార్మికులను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు తెలిపారన్నారు. పదేళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఉన్న పళంగా తొలగించడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సమక్షంలో కార్మికులకు, యాజమాన్యానికి జాయింట్ మీటింగ్ నిర్వహించి తగిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. మండల కమిటీ అధ్యక్షులు ఎం. సత్యన్నారాయణ, రైతు సంఘం బాపట్ల జిల్లా కమిటీ కార్యదర్శి బి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ మోపిదేవి



స్థానిక మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి మండల కేంద్రంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మోపిదేవికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో మోపిదేవి ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, బాపట్ల జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి , బందారు రామారావు, మరివాడ ప్రసాద్, ఎల్లెల రవికిరణ్, సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీలు పాలపర్తి రాణి, నాగుల నరసింహారావు, నాయకులు కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, తూము కోటేశ్వరరావు, నందిపాటి సుబ్బారావు, తురిమెళ్ల శ్రీధర్, దత్తు మురళీ నాగమధు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు ప్రజలను మోసం చేయటం వెన్నతో పెట్టిన విద్య

ప్రజలను మోసం చేయటం, మభ్యపెట్టటం, వాగ్దానాలను గాలికి వదిలివేయటం టీడీపీ పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఎద్దేవా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత అచ్చెన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదంటూ విమర్శలు చేయడంపై ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారన్నారు. అమలు కాని వాగ్దానాలను పుంకాను పుంకాలుగా టీడీపీ మేనిఫెస్టోలో ముద్రించి, ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచారని గుర్తు చేశారు. అందుకు ప్రజలు కూడా వారికి తగిన బుద్ధి చెప్పినా.. ఇంకా టీడీపీ నాయకులకు బుద్ధి మారలేదన్నారు. టీడీపీ పాలనలో ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారో.. ఎంత మంది నిరు పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించారో చర్చకు సిద్ధమా అంటూ మోపిదేవి అచ్చెన్నాయుడికి సవాల్ విసిరారు. ప్రజలంతా మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి యువకుడి మృతి



రేపల్లెరూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని 5వ వార్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భట్టిప్రోలు మండలం కోళ్లపాలేనికి చెందిన కొమరాబత్తుని నితిన్(20) విద్యుత్ తీగలను సరి చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగిలి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో.. తోటి కార్మికులు అతనిని వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. ఈ విషయమై విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్ వద్ద మృతుడు పనిచేస్తున్నాడని తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

మనవళ్లపై నాయనమ్మ ఫిర్యాదు

భట్టిప్రోలు: మనవళ్లు తనపై దౌర్జన్యం చేసి, ఏసీని పగల గొట్టడంతో ఓ వృద్ధురాలు స్థానిక పోలీసులను ఆశ్రయించింది. వివరాల మేరకు..భట్టిప్రోలు మండలం కోనేటిపురానికి చెందిన వృద్ధురాలు మండే పుష్పలత కుమారుడు మృతి చెందాడు. ఇద్దరు మనవళ్లు విజయవాడలో ఉంటున్నారు. ఈ క్రమంలో మనవళ్లు శైలేష్‌పాల్, దినేష్ మరో వ్యక్తి వచ్చి తమ ఏసీ(ఎయిర్ కూలర్) ఇంట్లో ఉందని, తమకివ్వాలని అడిగారు. ఆమె ఇవ్వననడంతో ఈ ఏసీని వారు పగలగొట్టారు. దీంతో నాయనమ్మ పుష్పలత గురువారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

నేడు ఈపూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొల్లూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఈపూరులో రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున నిర్వహించనున్నారని ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జులు వీరే..

బాపట్ల: వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గంలోని జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. బాపట్లకు వడ్డిముక్కల డేవిడ్, పట్టణానికి చింతల రాజశేఖర్, కర్లపాలేనికి నమ్మెట వెంకటేశ్వర రెడ్డి, పిట్టలవానిపాలేనికి ఆలూరి సురేష్‌బాబును నియమించారు.

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె పట్టణ, రూరల్ కన్వీనర్లుగా కె.కమల్‌దేవ్, కె.కృష్ణకిషోర్, చెరుకుపల్లికి వి.చంద్రశేఖర్‌రెడ్డి, నగరానికి టి.రాజా, నిజాంపట్నంకు పి.నాజర్‌ఖాన్‌ను కన్వీనర్లుగా నియమించారు.

వేమూరు నియోజకవర్గంలోని జేసీఎస్ మండల ఇన్‌చార్జీలు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలోని జేసీఎస్ ఇన్‌చార్జులుగా బట్టు మోషే(అమర్తలూరు), ఎస్.శ్రీనివాసరరావు(భట్టిప్రోలు), బిలా సుబ్బారావు(కొల్లూరు), అన్నపరెడ్డి వీరారెడ్డి(చుండూరు), దాది సుబ్బారావు(వేమూరు)ను వైఎస్సార్ సీపీ ప్రకటించింది.

దివ్యాంగుల కాలనీ అభివృద్ధికి చర్యలు

ఎంపీడీఓ రాధాకృష్ణ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ రాధాకృష్ణ

బాపట్ల: దివ్యాంగులకాలనీ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీఓ రాధాకృష్ణ పేర్కొన్నారు. వెదుళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని రామయ్య దివ్యాంగుల కాలనీలో రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు దివ్యాంగుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, వెదుళ్ళపల్లి ఎంపీటీసీ కుంచాల శ్రావణి, కుంచాల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయ్, గుంజి ఏడుకొండలు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజా, చల్లాపల్లి గోపి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత సిద్ధంకావాలి


సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నగరంపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుక ఉన్న మతోన్మాద ఆర్ఎస్ఎస్ దేశాన్ని తిరోగమనంలో నడిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏపీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాజగారితోట శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా గురువారం 'భారత దేశ రాజకీయాలు–యువత పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ . కామన్ సివిల్ కోడ్‌తో మతాలు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సర్వే పరిశీలన




గాజుల్లంకలో సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

కొల్లూరు : గాజుల్లంక, పెసర్లంక సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష సర్వేను గురువారం కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గాజుల్లంక సర్పంచ్ సనక వెంకట్రావు, ఈఓపీఆర్‌డీ రవికుమార్, ఆర్ఐ త్రివేణి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' అవగాహన

పెనుమర్రు(వేమూరు): మండల ప్రత్యేకాధికారి విజయ పెనుమర్ర గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూలై 1న 'సురక్ష' పై గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మసీదులు, దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు



మసీదు వద్ద బందోబస్తులో పోలీసులు

బాపట్లటౌన్: ఈద్ అల్ అధా(బక్రీద్), తొలిఏకాదశి ఒకే రోజు రావడంతో ఆయా దేవాలయాలు, మసీదుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రజలనుద్దేశించి గురువారం ఒక ప్రకటనలో మాట్లాడారు. భారతదేశం సర్వమత సమ్మేళనమని ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. దేవాలయాలు, మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. దేవాలయాలు, మసీదుల వద్ద భక్తులు అధికసంఖ్యలో చేరుకోవడంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లు జరగకుండా నిఘా ఉంచామని తెలిపారు. సోషల్ మీడియాపై నిరంతర పర్యవేక్షణ, ట్రాఫిక్ సమస్యలు అన్ని రూట్లు పటిష్ట బందోబస్తు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

అలరించిన బ్రహ్మంగారి నాటకం



కళాకారులకు సత్కారం

నగరంపాలెం: భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటికను ప్రదర్శించారు. పలువురు పాత్రధారుల నటన ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణమూర్తి, విశ్వకర్మ సంఘ సభ్యులు తుర్లపాటి శంభయాచారి, ఈశ్వరచారి, కాజ భరద్వాజ, మేడూరి ప్రసాదరావు పాల్గొన్నారు. చివరగా కళాకారుల్ని కళా సేవారత్న అవార్డులతో సత్కరించారు.